## వనమహోత్సవంలో భాగస్వాములవ్వాలి

ఇందారం ఓపెన్‌కాస్టు గనిపై మొక్కలు నాటుతున్న జిల్లా అటవీ అధికారి ఆశిష్‌సింగ్

జైపూర్, జూలై 4: వనమహోత్సవంలో పాలుపంచుకోవాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. 75వ వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఇందారం ఓపెన్‌కాస్టు గనిపై డీఎఫ్‌వో ఆశీష్‌సింగ్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్పీటూ జీఎం ఏవీ రెడ్డి, ఓసీపీవో శ్రీనివాస్, ఏజీఎం మురళీధర్, గని మేనేజర్లు రవికుమార్, నాగన్న, ఫారెస్ట్ మేనేజర్ రమణారెడ్డి, ఎన్విరాన్‌మెంటల్ అధికారి హనుమాన్‌గౌడ్, ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌డీఎల్ యంత్రాల ప్రారంభం

యంత్రాలకు పూజలు చేస్తున్న మేనేజర్ అల్లావుద్దీన్

మందమర్రి, జూలై 4: సింగరేణి మందమర్రి ఏరియాలోని కేకే ఐదు గనికి నూతనంగా కేటాయించిన రూ.1.54 కోట్ల విలువైన 5 ఎస్‌డీఎల్ యంత్రాలకు గని ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గని మేనేజర్ అల్లావుద్దీన్ ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గని రక్షణాధికారి రమేశ్, అసిస్టెంట్ మేనేజర్ జస్వంత్, పిట్ ఇంజినీర్ నవీన్ కుమార్, సంక్షేమాధికారి కార్తీక్, ఏఐటీయూసీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్, పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా సంస్థల బంద్ విజయవంతం

కోటపల్లి/కన్నెపల్లి /కాసిపేట, జూలై 4 : నీట్, నెట్ పరీక్షల లీకేజీలను నిరసిస్తూ విద్యార్థి యువజన సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను మూసి వేయించారు. లీకేజీకి కారణమైన ఎన్‌టీఏ సంస్థను రద్దు చేయాలని, లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చైర్మన్ ప్రదీప్‌కుమార్ జోషి రాజీనామా చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

## బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరెస్ట్

కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో పోలీసుల అదుపులో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారిశెట్టి విద్యాసాగర్

కోటపల్లి, జూలై 4 : నిరుద్యోగ ర్యాలీ నేపథ్యంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కోటపల్లి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మారిశెట్టి విద్యాసాగర్‌ను కోటపల్లి పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని నిరుద్యోగ ర్యాలీకి మారిశెట్టి విద్యాసాగర్ తరలివెళ్తుండగా, జైపూర్ మండలంలోని ఇందారం ఎక్స్‌రోడ్ వద్ద ఎస్ఐ రాజేందర్ విద్యాసాగర్‌ను అదుపులోకి తీసుకొని కోటపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శాంతియుతంగా ధర్నా చేసేందుకు వెళ్తున్న తనను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కోటపల్లి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మారిశెట్టి విద్యాసాగర్ ఖండించారు. నిరుద్యోగులకు మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

## గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు ఉధృతం చేయాలి

- కార్మిక సంఘాల జేఏసీ పిలుపు

శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో కార్మిక నాయకులు

శ్రీరాంపూర్, జూలై 4 : తెలంగాణ సింగరేణి బొగ్గు గనులను వేలం ద్వారా ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సింగరేణి కార్మిక సంఘాలు, రాష్ట్ర జేఏసీ ఐక్య ఉద్యమాలకు కార్మికులను సిద్ధం చేయాలని నిర్ణయించిందని కార్మిక సంఘాలు నిర్ణయించాయి. శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సింగరేణి కార్మిక సంఘాలు(జేఏసీ) ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతి రెడ్డి సురేందర్‌రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, సీఐటీయూ ఏరియా కార్యదర్శి బాలాజీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి కస్తూరి చంద్రశేఖర్, సిరికొండ రాజయ్య పాల్గొని గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర జేఏసీ కోదండరాం ఆధ్వర్యంలో తీసుకున్న ఐక్య ఉద్యమాల్లో సింగరేణి అన్ని కార్మిక సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. గనుల వేలం, ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 5న కలెక్టరేట్‌ల ఎదుట కార్మిక సంఘాలు ధర్నా, 13న అన్ని జీఎం ఆఫీస్‌ల ఎదుట ధర్నా, ఈ నెల 17 సింగరేణి శ్రావణపల్లి బొగ్గు బ్లాకు వేలానికి వస్తున్నందున వేలం నిర్వహించే వద్ద హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున ఆందోళన, నిరసన ధర్నా చేపట్టాలని నిర్ణయించినట్లు నాయకులు ప్రకటించారు. ఇందులో కార్మికులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## సింగరేణిని నిర్వీర్యం చేసే కుట్ర

- గనుల వేలాన్ని బీజేపీ సర్కారు ఆపాలి
- ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీపీఎం, సీపీఐ నిరసన

కేంద్రప్రభుత్వం బిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

శ్రీరాంపూర్, జూలై 4 : తెలంగాణా సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసే కుట్రలో భాగమే కేంద్ర బీజేపీ ప్రభుత్వం సింగరేణి గనులను వేలం ద్వారా ప్రైవేట్ సంస్థలకు ధారదత్తం చేసే ప్రయత్నిస్తున్నదని ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు ఆరోపించారు. గురువారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు ర్యాలీగా వెళ్లి ధర్నా చేశారు. అనంతరం గనుల వేలం, ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జీఎంకు కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేణ శ్యామ్‌కుమార్, ఏరియా ఉపాధ్యక్షుడు శంకర్ రావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగె స్వామి, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతిరాజు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటనే కేంద్ర బీజేపీ ప్రభుత్వం సింగరేణికే గనులను నామినేషన్ పద్ధతిలో అప్పగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రి బట్టి విక్రమార్క గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ కోలిండియా యాజమాన్యానికి లేఖ ఇచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ కేంద్ర కార్యదర్శి భీంరావు, నాయకులు గోపాల్‌రెడ్డి, బ్రహ్మచారి, నీలం సదయ్య, సతీశ్, అనిల్, కొలిపాక సమ్మయ్య, శ్రీనివాస్, మహేందర్, జగదీశ్వర్‌రెడ్డి, ఎంబడి తిరుపతి పాల్గొన్నారు.

**మందమర్రిలో..**

మందమర్రి, జూలై 4: బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ మందమర్రి ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేసిన వారిలో ఐఎన్‌టీయూసీ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, కేంద్ర కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాంశెట్టి నరేందర్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లూరి లక్ష్మన్, కేంద్ర కమిటీ నాయకులు మిట్ట సూర్యనారాయణ, వెంకటస్వామి, బత్తుల వేణు, భిక్షపతి, కారుకూరి తిరుపతి, శంకర్‌రావు, కల్పన, జాడి లలిత, శనిగారపు రాములు, వై.సత్యం, నూనె పతి, హరిబాబు, హనీఫ్, వీ.రవి, బాలకృష్ణ, ఎం.డీ ఖాజా పాల్గొన్నారు.

**సింగరేణిలో సమ్మె చేయడానికి వెనుకాడం...**

కాసిపేట, జూలై 4 : బొగ్గు గనులను వేలానికి నిరసనగా సమ్మె చేసేందుకు సైతం వెనుకడబోమని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్ స్పష్టం చేశారు. గురువారం మందమర్రి ఏరియాలోని కాసిపేట 1వ గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జూలై 5 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే పోరాట కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ, చొప్పరి శ్రీహరి, వీ రాజేందర్, ఎస్ సురేశ్, కే సంతోష్, మైనింగ్ స్టాఫ్ నాయకులు సేద్యం శంకరయ్య, రాజు, రమేశ్, ఐ. సంపత్, ఏ తిరుపతి, ఏ సందీప్, వెంకటేశ్, కార్మికులున్నారు.

**బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలి**

ఆసిఫాబాద్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూలై 4: బొగ్గు గనుల వేలానికి నిరసనగా ఆసిఫాబాద్‌లోని అంబేద్కర్ చౌక్ వద్ద సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రీ సత్యనారాయణ, నాయకులు తిరుపతి, నర్సయ్య, రమేశ్, సురేశ్, శ్యామ్ రావు, రాంచందర్, శ్యామల తదితరులున్నారు.

**ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలి**

బెల్లంపల్లి, జూలై 4 :బొగ్గు గనుల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమించాలని ఏఐటీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటస్వామి తెలిపారు. మందమర్రి ఏరియాలోని శాంతిఖని గని ఆవరణలో గురువారం గని పిట్ కార్యదర్శి దాసరి తిరుపతి గౌడ్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి మంతెన రమేశ్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, నాయకులు బొంకూరి రాంచందర్, రత్నం ఐలయ్య, మిట్టపెల్లి రమేశ్, పిచ్చేట్టి సురేశ్, ఎం.సంతోష్, వో శ్రీకాంత్, వో.రాజేశ్, ఫక్రుద్దా, దాడి రమేశ్, సాకే శ్రీను, ఎస్.తిరు

మందమర్రిలో ధర్నా చేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

బెల్లంపల్లి : గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

## ఆర్కే-7 గనిలో ప్రమాదం

- కార్మికుడి కాలికి తీవ్ర గాయం
- ఆలస్యంగా వెలుగులోకి..
- ప్రమాద రిపోర్టు ఇవ్వడంలో అధికారుల జాప్యం!

శ్రీరాంపూర్, జూలై 4 : శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 7గనిలో ఈ నెల 1న ఉదయం ప్రమాదం జరగగా ఎలక్ట్రీషియన్ కార్మికుడు కుంట కుమారస్వామికి తీవ్ర గాయాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 1న ఆర్కే 7గనిలో నూతన ఎస్‌డీఎల్ యంత్రం ఇన్‌స్టాల్ చేయడానికి ఎలక్ట్రీషియన్ కుమారస్వామిపై ఎస్‌డీఎల్ యంత్రానికి ఉన్న తాడు(ఇనుప తాడు) తన కాలుపై పడింది. అధికారులు ఏరియా దవాఖానకు తరలించారు. నాలుగు రోజులుగా వైద్యం చేయిస్తున్నారు. మోకాలిలోని గుజ్జు పూర్తిగా తొలిగి పోవడంతో మోకాలికి ఆపరేషన్ చేయాల్సి ఉందని వైద్యులు తెలిపారు. కరీంనగర్, లేదా హైదరాబాద్‌లోని దవాఖానలకు సంస్థ రెఫరల్‌పై పంపించడానికి కార్మికుడి ప్రమాదాన్ని అధికారికంగా నమోదు చేయక పోవడంతో డాక్టర్లు అభ్యంతరం తెలిపినట్లు తెలిసింది. రెఫరల్ ద్వారా పరేషన్ చేయిస్తే 3 నుంచి 5 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలియగానే కార్మికుడు కుమారస్వామి ఈ విషయాన్ని గని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ముందుగా రెఫరల్‌కు ససేమీర అన్నారు. దీంతో కార్మికుడు కార్మిక నాయకుల దృష్టికి తీసుకెళ్లగా వారు ఏజెంట్, మేనేజర్‌పై ఒత్తిడి తేవడంతో గురువారం ఎట్టకేలకు ఏరియా దవాఖానకు గని ప్రమాద రిపోర్టును పంపించినట్లు తెలిసింది.

**కార్మికుడి ఒత్తిడితోనే రిపోర్టు చేయలేదు : ఆర్కే 7 మేనేజర్ శ్రీధర్**

ఈ నెల 1న శ్రీరాంపూర్ ఆర్కే 7గనిలో ఎస్‌డీఎల్ ఇనస్టాలేషన్ సమయంలో జరిగిన ప్రమాదంలో ఎలక్ట్రీషియన్ కుంట కుమారస్వామికి కాలికి గాయాలయ్యాయని మేనేజర్ శ్రీధర్ పేర్కొన్నారు. కార్మికుడు కుమారస్వామి తన ప్రమాద రిపోర్టు వద్దని చెప్పారని తెలిపారు. తోటి కార్మికులు కూడా కార్మికుడి ఇష్టం మేరకు ఏరియా దవాఖానకు పంపించినట్లు తెలిపారు. గురువారం ఉదయం తనకు తీవ్ర నొప్పిగా ఉందని గని ప్రమాద రిపోర్టు ఇవ్వాలని కోరాడని తెలిపారు. దాంతో ప్రమాద సమయంలో ఉన్న తోటి కార్మికులతో కలిసి వారి స్టేట్ మెంట్ తీసుకొని కార్మికుని ప్రమాద రిపోర్టు రామకృష్ణాపూర్ ఏరియా దవాఖానకు పంపినట్లు తెలిపారు.

## మరో కార్మికుడికి అస్వస్థత

శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 7గనిలో గురువారం ఉదయం సాయిని సత్తయ్య జనరల్‌మజ్దూర్ కార్మికుడు తీవ్ర అస్వస్థతకు గురై కింద పడ్డారు. గనిలోని 2ఏ సీం 27 సౌత్ లెవల్ పని స్థలంలో గత కొద్ది రోజులుగా కార్మికులకు సరిపడా గాలీ వెలుతురు లేదని గుర్తింపు కార్మిక సంఘం నాయకులు, కార్మికులు మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం విధులు నిర్వహిస్తున్న కార్మికుడు సాయిని సత్తయ్య ఒక్క సారిగా ఊపిరి ఆడగా అపస్మారక స్థితిలోకి వెళ్లి కిందపడ్డారు. దీంతో కార్మికుడిని ఏరియాస్పత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. సత్తయ్యకు కేవలం 6 నెలల సర్వీసు మాత్రమే ఉంది.

**జారిపడి కార్మికుడి చేతికి గాయాలు**

శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే7గనిపై ఉదయం త్రాగు నీరు ట్యాప్ వద్ద ప్రమాదవ శాత్తు బదిలీ వర్కర్‌గా పనిచేస్తున్న గడిగొప్పుల తిరుపతి జారిపడిన కార్మికుడి చేయి విరిగింది. వెంటనే నల్లా వద్ద పరిశుభ్రత పనులు చేపట్టాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

## కారు, బైక్ ఢీ- ఒకరికి గాయాలు

వాంకిడి, జూలై 4: మండలంలోని బంబార బస్టాప్ సమీపంలో జాతీయరహదారిపై బైక్‌పై వెళ్తున్న సాగర్ గౌడ్‌ను మహారాష్ట్ర చంద్రపూర్ వైపు నుంచి ఆసిఫాబాద్ వైపు వెళ్తున్న కారు వేగంగా బైక్‌ను ఢీ కొట్టింది. ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడి చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు స్థానికులు తెలిపారు